# తాత-మనవడు

-చంపక్

చక్రపాణి మాస్టారికి సన్మానం. చూసి తరించడానికి కాకినాడ పట్టణం అంతా తరలి వచ్చింది. శిష్యులు, శిష్యుల తల్లిదండ్రులు, శిష్యుల కొడుకులూ, హితులూ, సన్నిహితులూ...

నాలుగు దశాబ్దాల పాటు కాకినాడ విద్యారంగాన్నీ, విద్యార్థుల జీవితాలనూ ప్రభావితం చేసిన ఎనభై అయిదేళ్ల చక్రపాణి మాస్టారు వేదిక మీద మహారాజా చెయిర్‌లో వినమ్రంగా కూర్చుని ఉన్నారు. వేదిక మీద జిల్లా కలెక్టర్, ఇతర ప్రముఖులూ... వేద ఘోష జరుగుతుండగా, పూలజల్లు కురుస్తూ ఉండగా, మాస్టారికి తిలకం దిద్ది, గంధం పూసి, పన్నీరు జల్లి, శాలువా కప్పాడు కలెక్టర్.

తర్వాత వరుసగా శాలువలు, దండలు, బొకేలు మాస్టరు మోయలేనన్ని దండలు పడగానే వాటిని తీసి కార్యకర్తలు వేదికమీద ఒక మూల పెట్టగా ఆ గుట్ట పెరిగి పుష్పపర్వతమే తయారు! మాస్టారి కూతుళ్లు, అల్లుళ్లు కూడా వచ్చి పాదాభివందనం చేశాక చివరగా వచ్చి దండవేసి పాదాభివందనం చేస్తున్న యువకుని అదాట్టుగా చూసి ఉలిక్కిపడి సంభ్రమంగా లేచి అతడిని హృదయానికి హత్తుకున్నాడు మాస్టరు.

ఆ యువకుడు మాస్టారికి...మనవడు!...మనూ!

మనవడిని హృదయానికి హత్తుకుంటూనే యథాలావంగా మాస్టరు గుమ్మంవైపు చూశారు. అక్కడ భార్య సమక్షంలో తప్ప మరెక్కడా నవ్వడమే ఎరుగని వింతజీవి.

...ముట ముటల ముఖంవాడు...సూర్యం!

ఆ సూర్యం మరెవ్వరో కాదు... సాక్షాత్తూ మాస్టారి సుపుత్రుడే! మాస్టారి గురించి తెలిసిన వారు ప్రశంసలతో ప్రసంగాలు ప్రారంభించగానే ఆయన మధురస్మృతులలోకి క్రమంగా మృదువుగా కూరుకుపోయారు.

★★★

అరవై ఏళ్ల క్రితం బ్రతుకు తెరువు వెదుక్కుంటూ పొట్ట చేత్తో పట్టుకొని ఉత్తరాంధ్ర జిల్లా నుంచి జీవనపథంలో సాగివస్తున్న చక్రపాణిని కాకినాడ ఆప్యాయంగా అక్కున చేర్చుకుంది. ఎనిమిదో క్లాసు పాసై హయ్యర్‌గ్రేడు టీచర్‌గా జీవితం ప్రారంభించి తీరిక వేళల్లో బీద విద్యార్థులకు ఇంటి వద్ద ఉచితంగా పాఠాలు చెబుతూ వాళ్లతో బాటు తనూ చదువుకుంటూ క్రమంగా మెట్రిక్, బియ్యే, బియీడీ కోర్సులు పూర్తి చేసి స్కూలు అసిస్టెంట్ స్థాయికి ఎదిగిన ఆయన్ని అందరూ ఆప్యాయంగా చక్రపాణీ మాస్టారూ అని పిలిచేవారు.

ఒక అబ్బాయి, ఇద్దరు అమ్మాయిలూ పుట్టాక భార్య చనిపోగా, విధవ అక్కగారొచ్చి ఆ ఇంటికి అండగా, ఆడదిక్కుగా నిలబడింది. ఆయన రెండో వివాహం మాట తలపెట్టకుండా పూర్తిగా విద్యావ్యాప్తికే అంకితమై పోయారు.

ఉదయం తొమ్మిది నుంచి సాయంకాలం ఐదు వరకు స్కూలు.

మిగిలిన సమయంలో ఇంటి వద్ద ట్యూషన్‌లతో ఊపిరి సలపని బిజీ. పేరుకు ట్యూషన్ గాని హౌస్ ఫుల్, కలెక్షన్ నిల్ - పద్ధతి! బీదా, బిక్కీకి ఫ్రీ. ధనవంతులు కూడా వీళ్లని చూసి ఫీజ్ ఎగ్గొట్టేవారు. ఫీజు ఇచ్చినా ఇవ్వకపోయినా వివక్ష లేకుండా పాఠం చెప్పే ఆయన విద్యార్థులకు దేవుడే అయ్యారు.

జీవితంలో ఒక ఆదర్శం ఏర్పర్చుకుని అందుకోసమే అహర్నిశలూ పరితపించే వారికి సంసారాన్ని పట్టించుకునే తీరిక ఉండదు. ఆడపిల్లలిద్దరూ శ్రద్ధగా చదువుకుంటూ చకచకా పరీక్షలు పాస్ అయ్యేవారు కాని అబ్బాయి సూర్యంది విచిత్ర ప్రవృత్తి. ఎవరితోనూ కలిసేవాడు కాదు. మాట్లాడేవాడు కాదు. తన మనసులోని భావాన్ని ఎదుటివారే గ్రహించి తదనుగుణంగా ప్రవర్తించాలని అతని ఉద్దేశం! మాస్టారి అబ్బాయి కదా అన్న గౌరవంతో ఎవరో సూర్యంకి కలెక్టర్ ఆఫీసులో గుమాస్తా ఉద్యోగం ఇప్పించారు.

ఆ రోజుల్లోనే మున్సిపాల్టీ వారు మాస్టార్లకు నామమాత్రపు రేటుకి ఇళ్ల స్థలాలు కేటాయించడంతో చక్రపాణి మాస్టారు మూడు పోర్షన్ల డాబా, దానికి ఎదురుగా ట్యూషన్‌ల కోసం ఒక హాలు కట్టించుకున్నారు.

పిల్లల వివాహం... అక్కగారి మరణం... మాస్టారి పదవీ విరమణ వరుసగా జరిగాయి.

భార్య లక్ష్మి రాకతో సూర్యం తరహాయే మారిపోయింది. అతడికామె కళ్లూ, చెవులూ, మెదడూ అయి కూర్చుంది. మామగారు పట్టించుకోకపోవడం, భర్త మూగదేవుడిలా మూల కూర్చోవడంతో తల్లి అమూల్య సలహాల ప్రకారం లక్ష్మి ఆ ఇంటి ఆడపడుచుల్ని, అల్లుళ్లని అవమానించడం మొదలు పెట్టింది. ఆమె నోటి ధాటిని తట్టుకోలేక వాళ్లా ఇంటికి రావడమే మానుకున్నారు. సూర్యంకి భార్య వాణియే బాణీ అయింది. తండ్రిని "ఆ ముసిలోడు" అనడం ప్రారంభించాడు. మాస్టారు లక్ష్మికి కూడా "ఆ ముసిలోడే" అయ్యారు!

ట్యూషన్‌లో పడితే మాస్టారికి భోజనం గుర్తు రాదు. అక్క అయితే తమ్ముడి రాక కోసం ఎదురు చూస్తూ కూర్చునేది. ఆయన ట్యూషన్ ముగించి లోనికి రాగానే వేడివేడి భోజనం వడ్డించేది.

ఆమె చనిపోయేక ఆయన కోసం ఎదురు చూస్తూ కూర్చునే వారే లేరు. భోజనం టేబుల్ మీద పెట్టేసి బాధ్యత తీరిపోయినట్లు కోడలు తన గదిలోకి పోయి టీవీకి అతుక్కుపోయేది. మధ్యాహ్నం ఏ మూడు గంటలకో భోజనం చేయలేదని జ్ఞాపకం వస్తే మాస్టారు లోనికి వచ్చేవారు. అప్పటికే మెతుకులు మేకులూ, పప్పు మంచు ముద్ద అయ్యేవి.

ఒకనాడాయన లోనికి వచ్చినప్పుడు భోజనమే లేదు. కిచెన్‌లోకి వెళ్లి చూస్తే ఎక్కడా అన్నం, కూరలూ కనపించనే లేదు! తన ఇంటిలో ఉంటూ తన సంపాదనే తింటున్న కోడల్ని - నా భోజనం ఏదీ? - అని అడగడానికి ఆయనకు ఆత్మాభిమానం అడ్డొచ్చింది.

ఆనాటి నుంచి ఆయనకు ఆ ఇంట్లో భోజనం - బంద్! రెండు రోజుల అభోజనం తర్వాత మూడవ రోజు మాస్టారు ఆ ఇంటిలో కనిపించలేదు. నాలుగో రోజు ఆ ఇంటికొచ్చిన లాయరు ఆస్తి మూడు సమాన భాగాలుగా ముగ్గురు పిల్లలకూ పంచి ఇస్తూ మాస్టారు రాయించిన వీలునామా ప్రతి సూర్యంకి అందజేశాడు.

★★★

అందరూ చప్పట్లు కొడుతోంటే ఉలిక్కి పడి ఈ లోకానికొచ్చిన చక్రపాణి మాస్టారు తలెత్తి చూశాడు.

"మాస్టారు ఏజెన్సీ ప్రాంతంలో ఒక వదాన్యుడు నిర్మించిన ఆశ్రమ పాఠశాల బాధ్యత స్వీకరించి గిరిజన బిడ్డలకు దేవుడే అయ్యారు. ఆ దేవునే మనం ఇక్కడ ఇప్పుడు సన్మానిస్తున్నాం. కాదు, కాదు... పూజించుకుంటున్నాం... ఇప్పుడు కలెక్టర్‌గారు మాట్లాడుతారు" అంటూ మైక్ ఆయనకు అందించి తప్పుకున్నాడు వక్త.

"చక్రపాణి మాస్టారు తీర్చిదిద్దిన మట్టిముద్దను నేను. హైస్కూలులో నేను చదివే ఆ రోజుల్లో మస్టార్లు కూడా దళితున్ని ఇంట్లోకి రానిచ్చేవారు కాదు. దళిత విద్యార్థుల డౌట్స్ మాస్టార్లు తీర్చేవారు కాదు. ఆ రోజుల్లో మా లాంటి వారికి చక్రపాణి మాస్టరే దిక్కు, మొక్కు... సర్వస్వం! మాస్టారు నాకు కేవలం విద్యా దాత, అన్నదాత మాత్రమేకాదు... ప్రాణదాత కూడా" అంటూ కాసేపాగి చుట్టూ చూశాడు కలెక్టర్.

దిక్కులు పిక్కటిల్లేటట్లు చప్పట్లు!

చటుక్కున వంగి మాస్టారికి పాదాభివందనం చేశాడు కలెక్టర్. మాస్టారు ఉలిక్కిపడి చటుక్కున లేచి శిష్యుడిని రెండు చేతులతో లేవదీసి హృదయానికి హత్తుకున్నారు.

కలెక్టర్ కళ్లలో నీళ్లు... మాస్టారి కళ్లలోనూ నీళ్లే...!

ఇద్దరి ముఖాలలోనూ ఆనంద పారవశ్యం!

సభ పూర్తయ్యే వరకూ ఉండి కలెక్టర్ వద్దసెలవు పుచ్చుకొని ఇంటికి వెళ్లాక

"ముసిలోడు వద్ద డబ్బు బాగానే ఉన్నట్టుంది. మనకొక దెయ్యాల కొంప పడేసి తనేమో ఏజెన్సీకి పోయి దండిగా సంపాదిస్తున్నాడు కాబోలు. లక్షో, రెండు లక్షలో పారేసి సన్మానం బాగానే చేయించుకున్నాడు లే" అంటూ సూర్యం భార్యకి వివరిస్తూ ఉండగా

"నేనొక లక్ష ఇస్తా. అంత ఘనంగా సన్మానం చేయించుకొని కలెక్టర్ చేత పాదాభివందనం చేయించుకోగలవా?"

చటుక్కున సూర్యం, లక్ష్మి గుమ్మం వైపు తిరిగారు. ఎదురుగా... మనూ.

"బెంగుళూరు నుంచి వచ్చిన వాడివి తిన్నగా ఇంటికి రాక ముసిలోడి సన్మానానికెందుకు వెళ్లావురా?" ఖంగుమంది లక్ష్మి.

"మీకొక ముఖ్య విషయం చెప్పాలని వచ్చాను. ఊళ్లో అడుగు పెట్టగానే తాతగారికి సన్మానం అని తెలిసింది. వెళ్లాను" లోనికి వచ్చి సూట్‌కేసు ప్రక్కగా పెట్టి అన్నాడు మనూ.

"ఏమిటా ముఖ్య విషయం?" అనుమానంగా అడిగింది లక్ష్మి.

బెంగుళూరులో తమ కంపెనీలోనే పనిచేస్తున్న వేరే కులం అమ్మాయిని ప్రేమించాడట. మీరు పెళ్లి చేస్తారా? నన్నే చేసుకోమంటారా అని బాంబు పేల్చాడు మనూ.

దిగ్భ్రాంతి చెందిన లక్ష్మి తేరుకుని ఒక్కసారిగా రెచ్చిపోయి కొడుకుని తిట్టి పోసి చివరకు "మా కడుపున చెడబుట్టావురా" అంది.

"అందుకు సంతోషిస్తున్నా మమ్మీ" కూల్‌గా చెప్పాడు మనూ.

"ఏమిట్రా! ఏమిట్రా నీ ఉద్దేశం!"

నీ కడుపులో ఉన్నదంతా కుళ్లే కదా! ప్రపంచం అంతా మీ మామగారిని పొగిడితే నువ్వేమో ఆయన్ని తిడతావు!

ఆయన కూతుళ్లు, అల్లుళ్లను అవమానించి ఇంటికి రాకుండా చేశావ్! చివరకు తిండి పెట్టకుండా మామగారినే తగిలేశావ్!

నీ కడుపున చెడబుట్టినందుకు సంతోషిస్తున్నా మమ్మీ!" అంటూ తండ్రివైపు తిరిగాడు మనూ.

"డాడీ! ఆస్తినివ్వ లేదనీ, చదివించలేదనీ ఏనాడూ తన తండ్రిని నిందించలేదు నీ తండ్రి! స్వయంకృషితో అంచెలంచెలుగా ఎదిగి మహామనిషి అయ్యారాయన.

మరి నువ్వో? చదువు చెప్పించలేదనీ, మంచి ఉద్యోగం వేయించలేదనీ, సరిగా పెంచలేదనీ ఇప్పటికీ నీ తండ్రిని నువ్వు తిడుతూనే ఉన్నావ్! కన్న తండ్రిని నాన్నా అని పిలవలేని దౌర్భాగ్యుడివి!

ఆయన ఆస్తి తింటూ ఆయన్నే - ముసిలోడు అంటూ అవహేళన చేసే సంస్కారివి! అలాంటి నీకు చెడబుట్టినందుకు గర్విస్తున్నా"

"ఒరేయ్, ఒరేయ్! ఎంత లేసి మాటలంటున్నావురా! పెద్దలతో ఇలాగేనా మాట్లాడ్డం?" మొత్తుకుంది లక్ష్మి.

"ఔనౌనా? పెద్దలతో ఎలా మాట్లాడాలో మీ దగ్గరే నేర్చుకోవాలి!" వెటకారం పెల్లుబికింది మనూ స్వరంలో.

"మేం నీ కోసం సంబంధాలు చూస్తూనే ఉన్నాం కదరా!"

"మమ్మీ! నీ నటనలూ, అబద్ధాలూ, కుళ్లూ అంతా చూస్తూ నీ ఒడిలో పెరిగిన వాడిని! నువ్వెలాంటి పిల్లను ఎంపిక చేస్తావో నాకు తెలియదా? నీకు అధికారం ఇస్తే నీ అడుగులకు మడుగులొత్తే సేవకురాలిని కోడలుగా తెచ్చుకుంటావ్ గాని నా అడుగులో అడుగు వేసి, నా మనసెరిగి మసలుకునే సహధర్మచారిణిని తీసుకురావు. అందుకే నాకు నచ్చిన అమ్మాయిని చూసుకున్నాను. మీరు మా పెళ్లి చేస్తే సరే. లేకుంటే తాతగారి సమక్షంలో పవిత్రమైన ఆయన ఆశ్రమ పాఠశాలలోనే నా వివాహం" అంటూ చకచకా బయటకు నడిచాడు మనూ.

నిలువు గుడ్లేసుకొని మిడుతూ, మిడుతూ చూస్తూ ఉండిపోయారు ఆ వృద్ధ పరిత్యక్త దంపతులు!

★

